క్లుప్తంగా

పారిజాతగిరి వెంకన్న హుండీల ఆదాయం రూ.8.69 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల ఆదాయం 90 రోజులకు రూ.8,69,182 వచ్చినట్టు ఆలయ ఈఓ మానికల రాంబాబు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన హుండీల ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని గుర్వాయిగూడెం హుండీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీమద్దిఅంజనేయస్వామి దేవస్థానం కార్యనిర్వాహాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు. కామయ్యపాలెం సేవా సంఘం, ఏలూరు రిటైర్డ్ ఎంప్లాస్ సేవా సంఘం, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, మద్ది ఆలయ సూపరింటెండెంట్ కె.రంగారావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు సర్వేయింగ్ పరికరాలు



దాత అందించిన సర్వేయింగ్ పరికరాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు సర్వేయింగ్ పరికరాలు సమకూరాయి. సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి మేరకు కాకినాడ సుందర్ అసోసియేట్స్ ప్రొప్రైయిటర్ బాదం సుందరరావు రూ.50 వేలు విలువ గల పరికరాలను అందజేశారని ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. వెర్నియర్ దియేదలెట్స్–2, అల్యూమినియం పోల్డింగ్ ట్యాప్ స్టాప్–2, అల్యూమినియం ట్రేపాడ్–2 పరికరాల సమకూరినట్టు చెప్పారు. దాత సుందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్ రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి జయంతిని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ కార్యదర్శి సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 127 జయంతిని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు ఎన్ రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భరతమాత బానిస విముక్తికి 27 ఏళ్ల వయసులోనే ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువతి, యువకులు ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎస్కే మాబుసుభాని, ఎం వెంకట్రాజు, వినోద్, పి.పోతురాజు, ఎం మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెల్ల తాచుపాము పట్టివేత



పామును పట్టుకున్న క్రాంతి

జంగారెడ్డిగూడెం: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని మజ్జనపు రాచంద్రరావు పొగాకు కొట్టు వద్ద బయట ఉంచిన సిమెంట్ రేకుల కింద 8 అడుగులు పొడవు ఉన్న తెల్లతాచు పామును స్థానికులు గుర్తించారు. విషయాన్ని స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతికి తెలియజేయగా, ఆయన వచ్చి తెల్ల తాచుపామును పట్టుకున్నారు. దానిని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

జంగారెడ్డిగూడెం: స్థానికంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డి.కావ్య శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా రెస్టారెంట్‌లు, హోటళ్ల తనిఖీలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్‌లు తనిఖీ చేసినట్టు చెప్పారు. లైసెన్సులు ఉన్నవి, లేనివి తెలుసుకుని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృత్రిమ రంగులు ఆహార పదార్థాల్లో కలపకూడదని హెచ్చరించారు. హోటళ్లలో నమూనాలు సేకరించారు. ఆమెతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల కోసం రైతుల ఎదురుచూపు

మెట్టను పలకరించని తొలకరి



చింతలపూడి మండలంలో ఖరీఫ్ దుక్కి దున్నుతున్న రైతు



సరైన వర్షాలు లేక మెట్ట ప్రాంతంలో వెలవెల బోతున్న చెరువు

చింతలపూడి : మెట్ట ప్రాంతంలో తొలకరి జల్లులు ఇంకా పలకరించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతాంగం వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. సాధారణంగా మృగశిర కార్తెలో విత్తనాలు చల్లితే మంచి దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. కాని వాతావరణం చూస్తుంటే ఇప్పట్లో వర్షాలు కురిసేలా కనిపించడం లేదు. అయినా రైతులు పొలాల్లో ఎరువులు తోలుకుని, దుక్కులు దున్నుకుని, నారుమళ్లు పోసుకోవడానికి సంసిద్ధులవుతున్నారు. గత నాలుగు రోజులుగా అల్పపీడన ప్రభావంతో ఆకాశం మబ్బులు కమ్మి ఉండటంతో వర్షాలు కురిస్తే వెంటనే విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రతి ఏటా జూన్ 15 నాటికి నారుమళ్లు పోసి జూలై 15 నాటికి నాట్లు వేయడం పూర్తయ్యేది. అలాంటిది ఈ ఏడాది మాత్రం దుక్కులు దున్ని, నేలను చదును చేసుకుని ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలు వెనుక బడటం నిరాశను మిగిల్చాయి. ఏటా సబ్ డివిజన్‌లోని చింతలపూడి మండలంలో 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, టి.నరసాపురం మండలంలో 2,661 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లలో రైతులు వరి పంటను సాగు చేస్తారు. వాతావరణం చల్లబడటంతో వర్షాలు కురుస్తాయన్న ధీమాతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా వ్యవసాయ శాఖ రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

ఆలయ చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలి

కొయ్యలగూడెం: స్వయంభుగా వెలిసిన రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి ఈ దఫా యాదవులకు కేటాయించాలని యాదవ సంఘం నాయకులు పంది ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 300 సంవత్సరాల నాటి చరిత్ర గల ఈ ఆలయంలో ఇప్పటివరకు ముఖ్య పాత్ర పోషిస్తూ ఆలయ అభివృద్ధిలో తమ పాత్ర నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. అయితే గత ప్రభుత్వాలు యాదవ సామాజిక వర్గాన్ని విస్మరిస్తూ డైరెక్టర్ల పదవులతోనే సరిపడుతూ వస్తున్నారన్నారని వివరించారు. ఈ దఫా నూతన పాలకమండలి చైర్మన్ పదవిని యాదవ సామాజిక వర్గానికి అప్పగించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూసి త్రిమూర్తులు, మన్నే దుర్గ యాదవ్, బూసి రాజేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

చింతలపూడి: జూలై 1వ తేదీన ఉదయం నుంచే ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీఓ చిన రాట్నాలు, చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ బీజేఎస్‌పీ రాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జూలై 1న 95 శాతం పింఛన్ పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. చింతలపూడి రూరల్ మండలంలో 21 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 9,597 మంది పింఛన్‌దారులకు రూ.6,58,10,5000 సొమ్ము విడుదలైందన్నారు. పింఛన్ సొమ్ము సచివాలయ సిబ్బంది ఇంటింటికివెళ్లి పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ రాట్నాలు తెలిపారు. చింతలపూడి నగరపంచాయతీ పరిధిలోని 2,845 మంది పెన్షనుదారులకు 53 మంది సచివాలయ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. పింఛన్ల సొమ్ము రూ.1,99,15,000 ఆయా సచివాలయాల కార్యదర్శులకు అందించనున్నట్టు చెప్పారు. ఉదయం 6 గంటల నుంచే పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, నోడల్ అధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



చింతలపూడిలో మలేరియాపై అవగాహన ర్యాలీ

చింతలపూడి : మలేరియ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియ సబ్‌యూనిట్ అధికారి ఎన్ ఎ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియ మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి సుప్రీంపేట వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఏ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల్లో మలేరియ వ్యాధి పట్ల అవగాహన కలిగించి, డెంగీ మరణాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. వృథా నీటి నిర్మూలనే దోమల నియంత్రణకు మార్గమని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యమన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. చలితో జ్వరం వస్తే మలేరియాగా అనుమానించాల్సి వస్తుందని, తక్షణం వైద్య సిబ్బందిని సంప్రదించాలని అన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి తొట్టెలపై మూతలు వేసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ మేల్ సయ్యద్ జఫ్రుల్లా, కె.శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు మంగతాయారు, కుమారి, వజ్రం, దేవమాత, అరుణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ



నూకాలమ్మవారి రజత వస్త్రానికి వెండిని సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదద్వారా సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహా మంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ వె.ప్రసన్న వెంకటేష్, మానస దంపతులు (ఏలూరు) అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారని తెలిపారు. అమ్మవారి రజత వస్త్రం తయారీకి మరిశర్ల గిరిధర్, నీహారిక, సూర్య వివాన్ కార్తీకేయ కుటుంబ సభ్యులు (వైజాగ్) రూ.10,116 విలువగల వెండి, పాదిలి కమలదాస్, పకీరమ్మ దంపతులు (నిడదవోలు) రూ.5,116 విలువగల వెండి, కిర్దత్ రేవన్సిద్, సురేఖ దంపతులు 61 గ్రాముల వెండిని సమర్పించారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీవారి దేవస్థానం ఈఓ



కలెక్టర్ వెట్రి సెల్వికి పూల బొకేను అందిస్తున్న ఈఓ

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును, ఏలూరు నూతన కలెక్టర్ వెట్రి సెల్విని శుక్రవారం శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉదయం నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఎమ్మెల్యే మద్దిపాటిని ఆయన నివాసం వద్ద ఈఓ, అర్చకులు, పండితులు మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అర్చకులు, పండితులు మద్దిపాటికి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఈఓ త్రినాథరావు చినవెంకన్న మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఈఓ త్రినాథరావు ఏలూరు కలెక్టరేట్‌లో నూతన జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి, పూల బొకేను అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ ప్రసాద్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో రక్షిత మంచి నీరు – వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రజలకుండా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రపరచాలని, వీధులలో చెత్తాచెదారాలు లేకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వల వల్ల దోమలు పెరిగి, జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలకు సూచించారు. జ్వరాలు ప్రబలిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలని అన్నారు. విస్తరణ అధికారి నాగిరెడ్డి, సీడీపీఓ బ్యూలా, పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య, డాక్టర్ ఉదయ్, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎం దంపతులకు సత్కారం



ఆర్ఎం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతుల అభివృద్ధిలో రాజమండ్రి రీజనల్ మేనేజర్‌గా వర్జినియా పొగాకు బోర్డు అధికారి ఆర్ఎం ఆదిశేషయ్య విశేష కృషి చేశారని ఎస్ఎల్ఎస్ పరిధి వేలం నిర్వహణాధికారులు పేర్కొన్నారు. స్థానిక వర్జీనియా పొగాకు వేలం కేంద్రం భవనంలో శుక్రవారం వేలం నిర్వహణాధికారిణి గ్రేసీ మార్గరేట్ ఆధ్వర్యంలో ఆదిశేషయ్య, మాలతీ దంపతులను సత్కరించారు. జూన్ చివరలో ఉద్యోగ విరమణ చేస్తున్న ఆదిశేషయ్య అభినందన కార్యక్రమం నిర్వహించారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గోపాలపు రం వేలం కేంద్రాల రైతులకు, కార్యాలయాల ఉన్న తికి ఆదిశేషయ్య కృషిని అధికారులు కొనియాడారు.

27న కాకినాడలో వర్క్‌షాప్

దెందులూరు: కాకినాడలో జూలై 27న నిర్వహించే సమావేశానికి న్యాయవాదులు, మేధావులు, జర్నలిస్టులు తరలిరావాలని అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఎఫ్) వర్క్‌షాప్‌నకు ఆహ్వానిస్తుందని ఏఎఫ్ చైర్మన్, న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా దెందులూరులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ మోహన్‌రావు

బుట్టాయగూడెం: ప్రస్తుత వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాప్రవీణ్ మాట్లాడుతూ మంచి నీటి ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసే విధంగా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీటీసీ అల్లూరి రామ్మోహన్‌రావులు 15 ఫైనాన్స్, జనరల్ ఫండ్ నిధులతో చేపట్టిన పనుల వివరాలను తెలియజేయాలని కోరారు. సంబంధింత వివరాలను ఎంపీడీఓ వారికి అందజేశారు. అనంతరం వ్యవసాయశాఖ, హార్టికల్చర్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలపై అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీసీసీ గోడౌన్‌లో తనిఖీ

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం జీసీసీ గోడౌన్‌లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ నిల్వల వివరాలను పరిశీలించారు. జీసీసీ కార్యాలయాన్నీ సందర్శించారు. గిరిజన సహకార సంఘం నిర్వహిస్తోన్న పెట్రోల్ బంక్‌ను సందర్శించి విక్రయాల వివరాలను జీసీసీ అకౌంటెంట్ సీహెచ్ రాజయోగిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీసీసీ గోడౌన్ సూపరింటెండెంట్ బి.అర్జునుడు, గోడౌన్ ఎంఎల్ఎస్ డీఈఓ నిట్టా సూర్యచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



రావికంపాడు హైస్కూల్లో మొక్క నాటుతున్న దృశ్యం

కామవరపుకోట: పర్యావరణాన్ని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా స్కౌట్స్ గైడ్స్ ట్రెనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కౌట్ గైడ్స్ విద్యార్థులతో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు మాట్లాడుతూ మానవ మనుగడ ముందుకు పరిసరాల పరిశుభ్రత తో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతని అన్నారు. వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీడనిచ్చే మొక్కలు నాటి, పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కౌట్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

భూదేవి పండుగకు విరాళాల సేకరణ



ఇటికిలకోట సమీపంలో రోడ్డుపై విరాళాలు సేకరిస్తున్న గిరిజన మహిళలు

పోలవరం రూరల్: తొలకరి ప్రారంభంకాగానే సకాలంలో వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భూదేవి పండుగ చేయడం గిరిజనులకు అనాధిగా సాంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో పోలవరం మండలం ఇటికిలకోట గ్రామానికి చెందిన గిరిజన మహిళలు పండుగ చేసేందుకు దాతల సహకారం కోరుతున్నారు. ఇటికిలకోట గ్రామ సమీపంలో రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, బాటసారుల నుంచి పండుగ సహకారం కోరుతూ విరాళాలు అభ్యర్థిస్తున్నారు. పండుగ రోజు గ్రామస్తులంతా గిరిజన సంస్కృతి సాంప్రదాయాలతో పండుగ వేడుకలు నిర్వహిస్తారు.

ఎన్ఎఫ్ఎస్‌యూ పరీక్షా ఫలితాల్లో జాస్మిన్‌కు 24వ ర్యాంకు



విద్యార్థిని కొప్పుల జాస్మిన్

కామవరపుకోట: శుక్రవారం ప్రకటించిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ అర్హత పరీక్షా ఫలితాల్లో మండలంలో తాడిచర్ల గ్రామానికి చెందిన కొప్పుల రామకృష్ణ, లక్ష్మీ కుమారి దంపతుల కుమార్తె జాస్మిన్ జాతీయస్థాయిలో 24వ ర్యాంకు సాధించింది. విద్యార్థిని జాస్మిన్‌ను పలువురు అభినందించి, సన్మానించారు.

అప్రమత్తతతోనే అతిసారానికి చెక్

- వర్షాకాలంలో అతిసార వ్యాప్తి
- అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయం



భీమడోలులో నీటిలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ సిబ్బంది

భీమడోలు: వర్షాకాలంలో ప్రబలే ప్రాణాంతక వ్యాధుల్లో అతిసారం (డయేరియా) ఒకటి. ఆ వ్యాధి బారిన పడిన వారు నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాప్రాయానికి దారితీస్తుంది. వ్యాధి కారకాలు, ముందస్తు జాగ్రత్తలపై ప్రజలంతా అవగాహన కలిగి జాగ్రత్తలను పాటిస్తే నిర్మూలన సాధ్యమవుతుంది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు తాజా, వేడి ఆహార పదార్థాలు భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలను అనుసరిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని వైద్యులు అంటున్నారు. ఈ సీజన్‌లో పలు చోట్ల డయేరియా కేసులు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బాధితులు త్వరగా కోలుకోవడంతో సంబంధిత అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా కేసులు నమోదవుతుండడంతో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి చైతన్యవంతం చేస్తున్నారు. ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి వివరించారు.

డయేరియా లక్షణాలు

విరేచనాలు నీరు మాదిరిగా, పలుచగా అవుతుంటే అతిసారం సోకినట్లు గుర్తించాలి. వైద్య పరిభాషలో గ్యాస్ట్రో ఎంటెరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణ వ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70 శాతం వైరస్ వల్ల వస్తాయి. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినకూడదు. తింటే వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి. కడుపులో మెలిపెట్టినట్లు నొప్పిగా ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. శరీరంలోంచి అధిక మొత్తంలో నీరు బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. నీరసంగా ఉండడం, నోరు, నాలుక పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం, మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా రావడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ ఏర్పడి పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం సంభవిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డయేరియా సోకే కాలంలో క్లోరిన్ కలిపిన నీటిని విడిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే. కుండ లేక బిందెల్లో చేతులు ముంచి మంచి నీటిని తాగరాదు. కాడ గిన్నెతో నీటిని గ్లాసుల్లో పోసుకుని తాగడం మంచిది. కలుషితమైన నీరు తాగరాదు. మంచినీటి పైపులైన్ మరమ్మతులను విధిగా చేయించుకోవాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతి పంపులు, కుళాయిల చుట్టూ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించాలి. నిల్వ ఉన్న మాంసాహారంతో పాటు ఎలాంటి పదార్థాలను తీసుకోవద్దు. ఆహార పదార్థాలపై మూత ఉంచాలి. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత విధిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ మలవిసర్జన చేయరాదు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడడం అలవాటు చేసుకోవాలి. మంచినీటి చెరువు, మంచి నీటి బావులు వద్ద బట్టలు ఉతకడం, పశువులు కడగడం చేయరాదు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. సూక్ష్మజీవులు చేరకుండా పరిసరాల్లో చెత్త కుప్ప, పేడ నిల్వ ఉండరాదు. ఈగలతో పాటు ఇతర కంటికి కనపడని కీటకాలు సైతం చేరకుండా ఉండేందుకు వంట పాత్రలతో మూతలు ఉంచాలి. మాంసం, కూరగాయలు, ఫలాలు వినియోగించే ముందుకు కడగాలి. గోళ్లను ఎక్కువగా పెర గనివ్వరాదు. అతిసారం ఉన్నట్లయితే ఆ ప్రాంత పరిధిలోని ప్రభుత్వ వైద్యులకు సమాచారం అందించాలి.

విద్యారంగ సమస్యలపై వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు ఇన్‌చార్జి ఉప విదాశాఖాధికారి అల్లూరి ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అంశాలు వారీగా సర్వే నిర్వహించామని తెలిపారు. ఈ సర్వేలో తమ దృష్టికి అనేక అంశాలు వచ్చాయని, ప్రధానంగా విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు వారాలు కావస్తున్నా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందలేదని, విద్యాకానుకలో ఇచ్చే యూనిఫాం, షూ, బ్యాగులు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్ట్ బోధించే ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. వెంటనే ఐటీ సబ్జెక్టు ఉన్న పాఠశాలకి ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో 12–1(సీ) లో భాగంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు అవకాశం కల్పించిన నేపథ్యంలో, ఆయా విద్యార్థులను సెకండ్ క్లాసులోకి ప్రమోట్ చేయాలంటే మొదటి క్లాసులో ఫీజు కట్టాలని ఆయా విద్యా సంస్థలు తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తున్నాయని, అటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సత్యసాయి సేవాసంస్థల ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణాపురంలోని సత్యసాయి సేవాకేంద్రంలో 100 మంది విద్యార్థులకు ఆయన చేతులు మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్యసాయి సూచించిన మార్గంలో నడుచుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. అందర్నీ ప్రేమించు, అందర్నీ సేవించు అనే సాయి సూక్తి స్ఫూర్తిదాయకం అన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలోనూ తమ సంస్థల ద్వారా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పైడేటి రామారావు, కె.వెంకటేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, సోడిశెట్టి శాంత కుమార్, పాలడుగు శ్రీరంగం, విద్యార్థుల తల్లిదండ్రులు, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు డిప్యూటీ కమిషనర్ రాధ బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్ రాధను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్‌ను డీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గత కొంతకాలంగా ఏలూరు నగరంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రాధను తాజాగా బదిలీ చేశారు.